# సాక్షి ఖమ్మం

శుక్రవారం । 6 । జనవరి । 2023






**బయో మైనింగ్ షురూ..**

దానవాయిగూడెంలోని డంప్ యార్డులో బయో మైనింగ్ పనులను కాంట్రాక్ట్ సంస్థ బాధ్యులు మొదలుపెట్టారు.

8లో



**గిరిజనుల స్వయం ఉపాధికి కృషి**

గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి ట్రైకార్ ద్వారా పథకాలు అమలు చేస్తున్నట్లు చైర్మన్ రామచంద్రనాయక్ వెల్లడించారు.

10లో

గరిష్టం / కనిష్టం
31° / 17°

**వాతావరణం**

శుక్రవారం ఉదయం, సాయంత్రం దాటాక చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పలు ప్రాంతాల్లో మంచు ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### నేడు జిల్లాలో మంత్రులు, ఎంపీ పర్యటన

**ఖమ్మంమయూరిసెంటర్:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. కూసుమంచి మండలం ఈశ్వరమాధారంలోని భగత్‌వీడు–మద్దివారిగూడెం రోడ్డులో హైలెవల్ బ్రిడ్జి, రాజుపేట నుండి పెరికసింగారం వరకు కనెక్టింగ్ రోడ్డు, ఖమ్మం నుండి పాపటపల్లి వయా దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్ వెళ్లే రోడ్డు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశాక మధ్యాహ్నం 12 గంటలకు రామన్నపేటలో జరిగే సభలో మంత్రులు, ఎంపీ మాట్లాడుతారు. అనంతరం తల్లాడ నుండి గంగదేవిపాడు రోడ్డు, కల్లూరు మండలం చెన్నూరులో రంగాపురం నుండి చెన్నూరు, కుర్నవల్లిలో రోడ్ల ఆధునికీకరణ పనులకు ఎంపీ, మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు.

### రేడియాలజీ విభాగంలో పోస్టుల భర్తీ

**ఖమ్మం వైద్యవిభాగం:** జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రారంభించనున్న రేడియో దయాగ్నసిస్ హబ్‌లో పోస్టులు భర్తీ చేయనున్నట్లు జిల్లా ఆస్పత్రుల ప్రధాన పర్యవేక్షణ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక రేడియాలజిస్ట్, రెండు రేడియోగ్రాఫర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారం, వివరాల కోసం జిల్లా వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

### డయాలసిస్ సేవలపై ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారుల ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులు

**ఖమ్మం వైద్యవిభాగం:** జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆరోగ్యశ్రీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాంరాథోడ్, జనరల్ మేనేజర్ దయానందరావు, విజిలెన్స్ డీఎస్పీ నరసింహారెడ్డి డయాలసిస్ కేంద్రాన్ని తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న సేవలతో పాటు రికార్డులను పరిశీలించారు. డయాలసిస్ చేయించుకునేందుకు వచ్చిన 15 మందితో మాట్లాడి సేవలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆస్పత్రిలో టీహబ్ ఉన్నా పరీక్షలు బయట చేయించుకోవాలని సూచిస్తున్నట్లు తెలియడంతో సిబ్బందిని మందలించారు. అనంతరం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించి అవసరమైన పరికరాలు తెప్పించి ఎక్కువ మందికి సేవలందించాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుతో సమావేశమయ్యారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపి, మేనేజర్ శ్రీనివాస్, ఆరోగ్యమిత్ర రమ, టీం లీడర్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీ వర్క్‌షాప్‌లో జెడ్పీ చైర్మన్



కేంద్రమంత్రితో మాట్లాడుతున్న కమల్‌రాజ్

**ఖమ్మం సహకారనగర్:** కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యాన గ్రామీణాభివృద్ధిపై గురువారం ఢిల్లీలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పాల్గొన్నారు. తొలిరోజైన గురువారం గ్రామీణాభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్‌తో సమావేశమైన కమల్‌రాజ్ అభివృద్ధి పనులను వివరించారు.

### కరోనా సన్నద్ధతపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

**ఖమ్మం వైద్యవిభాగం:** జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మెడికల్ సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్ బి.వెంకటేశ్వర్లు ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్లతో కరోనా సన్నద్ధతపై సమీక్షించారు. కరోనా జాగ్రత్తలు, పరీక్షల పెంపుతో పాటు ఆరోగ్యశ్రీ కేసులు, సాధారణ ప్రసవాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్లు కె.వెంకటేశ్వర్లు, రాజేష్, సురేందర్, లవన్, అశోక్, విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నిర్మాణం పూర్తయి ఏడాది

కొణిజర్ల పంచాయతీలో నిర్వహించిన వివిధ పనులకు సంబంధించి బిల్లులు పేరుకుపోయాయి. స్థానిక గాంధీసెంటర్ నుంచి ఊర చెరువు వరకు సుమారు రూ.12 లక్షల వ్యయంతో సైడ్ డ్రెయిన్ నిర్మించారు. దీనికి బిల్లు రాకపోగా, రెండేళ్ల క్రితం రూ.22 లక్షలతో నిర్మించిన రైతు వేదిక భవనం చివరి బిల్లు పెండింగ్‌లో ఉంది. ఇక రూ.15 లక్షలతో ముత్యాలమ్మ రోడ్డులో నిర్మించిన సీసీ రోడ్డు ఫైనల్ బిల్లు పరిస్థితి అదే! ఈ ఒక్క జీపీలోనే దాదాపు రూ.25 లక్షలకు పైగా పనులను సర్పంచ్ అప్పు తెచ్చి చేయించగా, బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు.



# నిధుల పంచాయితీ!

- నాలుగు నెలలుగా జీపీ నిధులకు గ్రహణం
- పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్ల కిస్తీ కట్టలేక సర్పంచ్‌ల అవస్థ
- అప్పులు తెచ్చి పనులు చేయిస్తున్నామని ఆందోళన
- గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులకూ బ్రేక్

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** జిల్లాలోని గ్రామపంచాయతీలకు నిధుల గ్రహణం పట్టింది. నిధుల లేమితో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులను కొన్నినెలలుగా నిధులు విడుదల చేయడం లేదు. నిధుల విడుదలలో జాప్యంతో సర్పంచ్‌లు అటు ప్రజలకు సమాధానం చెప్పలేక.. ఇటు పనులు పూర్తి చేయలేక సతమతమవుతున్నారు. అయితే, అధికారులు నిధులు వచ్చాయని చెబుతుండగా, సర్పంచ్‌లు ఖాతాల్లో జమ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

**కేంద్ర, రాష్ట్ర నిధులతో అభివృద్ధి**

గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏటా నాలుగు సార్లు నిధులు విడుదలయ్యేవి. ప్రస్తుతం నెలనెలా ఈ నిధులు విడుదలవుతున్నాయి. ఒకనెల కేంద్రప్రభుత్వం, మరో నెల రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తుంది. వీటితోనే గ్రామపంచాయతీల్లో వివిధ రకాల పనులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే, అటు రాష్ట్రం, ఇటు కేంద్రం నుంచి నాలుగు నెలలుగా నిధులు అందడం లేదు.

**ఆగస్టు తర్వాత అంతే...**

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ నిధులు రూ. 57,26,09,590 విడుదలయ్యాయి. నెలకు సాధారణ నిధులతోపాటు షెడ్యూల్ క్యాస్ట్ సబ్‌ప్లాన్, ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద రూ.11,45,21,918 చొప్పున విడుదల చేశారు. ఆ తర్వాత రాష్ట్రప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. నాలుగు నెలలుగా నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు సాగడం లేదు. ఇక పెండింగ్‌లో ఉన్న మ్యాచింగ్ గ్రాంట్‌లో రూ. 31,79,33,569ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు చెబుతున్నా ఇప్పటికీ సర్పంచ్‌లు జీపీల ఖాతాల్లో పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిధులు విడుదలవుతున్నాయి..**

జిల్లాలోని గ్రామపంచాయతీలకు నిధులు విడుదలవుతూనే ఉన్నాయి. గతనెల కూడా కొన్ని నిధులు విడుదలయ్యాయి. మిగిలిన నిధులు కూడా త్వరలోనే అందుతాయి. బిల్లులు, నెలవారీ నిధుల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– వీ.వీ.అప్పారావు, జెడ్పీ సీఈఓ

**పనుల్లో జాప్యం**

ప్రభుత్వం నుంచి నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం నర్సరీల్లో మొక్కల పెంపకానికి ఎరువులు, విత్తనాలను సర్పంచ్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇక పారిశుద్ధ్య పనుల నిర్వహణకు నిధులు లేకపోగా, చిన్నపంచాయతీల సర్పంచ్‌లు ట్రాక్టర్ కిస్తీ చెల్లించలేక ఆవేదన చెందుతున్నారు. ప్రతిరోజు చెత్త తరలింపు, అవెన్యూ ప్లాంటేషన్‌కు నీటి సరఫరా, ఇతరత్రా పనులకు ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్‌కు సైతం డబ్బులు లేవు. ఇవేకాక తాగునీటి పైపులైన్ల లీకేజీలు, వీధి లైట్ల కొనుగోలు, మోటార్ల మరమ్మతులను సైతం సర్పంచ్‌లే సొంతంగా చేయిస్తుండగా, ప్రతీనెలా సిబ్బంది వేతనాల కోసం నానా తంటాలు పడుతున్నారు.

**అప్పులు తెచ్చి పనులు చేస్తున్నాం..**



రోడ్లు, డ్రెయిన్లు, ఇంకుడు గుంతల నిర్మాణంతో పాటు పంచాయతీ నిర్వహణ ఖర్చులు దాదాపు రూ.18 లక్షలు రావాల్సి ఉంది. నెలల తరబడి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఇలా అయితే గ్రామాల్లో అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో ప్రభుత్వాలు ఆలోచించాలి.

– ఈవూరి సుజాత, సర్పంచ్, చెరువుమాదారం

**వేతనాలు, విద్యుత్ బిల్లులకే సరి**



పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రావడం లేదు. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసే నిధులు సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లులకే సరిపోతున్నాయి. దీనికి తోడు రూ.లక్షకు రూ.18వేలు జీఎస్టీ పేరుతో కోత విధిస్తున్నారు. దీంతో నాలుగో వంతు జీఎస్టీ కోతలకే పోతున్నాయి.

– సూరంపల్లి రామారావు, సర్పంచ్, కొణిజర్ల

# లెక్క తేలింది !



**30-39 ఏళ్ల వయస్సు ఓటర్లే అధికం**

- జిల్లాలో 11,53,987మంది ఓటర్లు
- అత్యధికంగా ఖమ్మంలో.. అత్యల్పంగా వైరా నియోజకవర్గంలో..
- యువ ఓటర్లు 20,066 మంది.. వందేళ్లు దాటిన వారు 180 మంది
- తుది జాబితా విడుదల చేసిన అధికారులు

**ఖమ్మం సహకారనగర్:** కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు అనంతరం జిల్లా ఓటర్ల లెక్క తేల్చారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 11,53,987మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 5,62,623, మహిళలు 5,91,290, ఇతరులు 74మంది ఓటర్లు ఉన్నట్లుగా జాబితా సిద్ధం చేశారు. గతేడాది నవంబర్ 9వ తేదీన ముసాయిదా ప్రకటించి నమోదు, మార్పులు, చేర్పులకు డిసెంబర్ 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఆతర్వాత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాక జిల్లాలో 11,53,987మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 28,667మంది ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఈమేరకు యంత్రాంగం తుది ఓటర్ల జాబితాను గురువారం విడుదల చేసింది.

**పెరిగిన ఓటర్లు 29,166**

ఐదు నియోజకవర్గాల పరిధిలో గతంతో పోలిస్తే 29,166మంది ఓటర్లు పెరిగారు. ముసాయిదా జాబితా ప్రకారం 11,24,821మంది ఓటర్లు ఉండగా కొత్తగా 37,193దరఖాస్తులు వచ్చాయి. ఇక గత జాబితా నుంచి 8,027ఓటర్లను తొలగించగా 11,53,987 మంది కొత్తగా చేరారు. అదనంగా ఎన్ఆర్ఐ ఓటర్లు 143మంది, సర్వీస్ ఓటర్లు 680మంది చేరారు. వీరిలో మెంబర్లు 672మంది, వారి సతీమణులు 8మంది ఉన్నారు. కాగా, జిల్లాలో 1,439 పోలింగ్ స్టేషన్లకు గాను ఖమ్మం నియోజకవర్గంలో 341, పాలేరులో 289, మధిరలో 268, వైరాలో 252, సత్తుపల్లిలో 289 ఉన్నాయని అధికారులు విడుదల చేసిన జాబితాలో వెల్లడించారు.

**ఖమ్మం టాప్..**

ఖమ్మం నియోజకవర్గంలో అత్యధికంగా 3,08,403 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా వైరా నియోజకవర్గంలో 1,84,840మంది ఉన్నారు. ఇక వయస్సుల వారీగా పరిశీలిస్తే 30–39ఏళ్ల వయస్సు వారు 3,28,612 ఓటర్లు ఉన్నట్లు తేలింది. అలాగే, వందేళ్లు దాటిన ఓటర్లు సైతం జిల్లాలో 180 మంది ఉన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న 18–19 ఏళ్ల వయస్సు వారు 20,066 మంది ఉన్నట్లుగా జాబితాలో వెల్లడైంది.

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ**

జిల్లాలో తుది ఓటర్ల జాబితా ప్రచురణ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ల వివరాలు, తొలగించిన వారి గణాంకాలను వివరించారు. కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, వివిధ పార్టీల ప్రతినిధులు బి.ఉపేంద్ర సాహు, జి.విద్యాసాగర్, ఎస్.నర్సింహారావు, ఆర్.ప్రకాష్, ఎస్ఎం.హుస్సేన్, వి.విజయ్, సీహెచ్.కృష్ణచైతన్య, టి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

**అత్యధికం.. అత్యల్పం...**

తుది ఓటర్ల జాబితాను పరిశీలిస్తే 30–39ఏళ్ల వారే అత్యధికంగా ఉన్నారు. ఈ వయస్సు వారు 3,28,612 మంది ఉండడం విశేషం. అలాగే, 18–19 ఏళ్ల వయస్సు వారు కేవలం 20,066మందే ఓటర్లుగా నమోదయ్యారు. ఇక 40–49 ఏళ్ల వారు 2,33,649మంది, 20–29 మధ్య వారు 2,06,870 మంది, 50–59మధ్య ఓటర్లు 1,81,593మంది, 60–69మధ్య వారు 1,09,004మంది, 70–79 మధ్య వారు 54,714మంది, 80–89మధ్య వారు 16,334మంది ఉండగా.... 90–99మధ్య వయస్సు ఓటర్లు 2,965మంది, వందేళ్లు పైబడిన వారు 180 మంది ఉన్నట్లుగా జాబితా ద్వారా వెల్లడైంది.

**తుది జాబితా ఆధారంగా జిల్లాలో ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| ఖమ్మం | 1,48,830 | 1,59,527 | 46 | 3,08,403 |
| పాలేరు | 1,08,554 | 1,14,636 | 06 | 2,23,196 |
| మధిర | 1,02,241 | 1,07,698 | 06 | 2,09,945 |
| వైరా | 90,809 | 94,024 | 07 | 1,84,840 |
| సత్తుపల్లి | 1,12,189 | 1,15,405 | 09 | 2,27,603 |
| మొత్తం | 5,62,623 | 5,91,290 | 74 | 11,53,987 |

# భూసేకరణ వేగవంతం చేయండి

రైల్వేలైన్ పనుల పరిశీలనలో కలెక్టర్ గౌతమ్



ట్రాక్‌పై పరిశీలిస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అధికారులు

**ఖమ్మం సహకారనగర్:** కొండపల్లి (విజయవాడ) నుండి కాజీపేట వరకు మూడో రైల్వే లైన్ ఏర్పాటుకు జిల్లాలో అవసరమయ్యే భూసేకరణను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. నగరంలో మూడో రైల్వే లైన్ నిర్మాణానికి భూమి అవసరమైన ప్రాంతాల్లో గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. నర్తకి థియేటర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద, సారథినగర్, బుర్హాన్‌పురం ప్రాంతాల్లో పరిశీలించిన కలెక్టర్.. సేకరించాల్సిన భూమి, కోల్పోనున్న కట్టడాల వివరాలు ఆరా తీశారు. ఈక్రమంలో రహదారులు, డ్రెయినేజీలకు ఎంత మేర నష్టం జరుగుతుందో తెలుసుకుని ఆ మేరకు అదనపు భూమి సేకరణపై సూచనలు చేశారు. ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి మండలాల్లోని 30 గ్రామాల నుండి 117.19 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఆర్డీఓ రవీంద్రనాథ్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, రైల్వే డివిజనల్ ఇంజనీర్ టి.సూర్యనారాయణ, తహసీల్దార్ శైలజ, ఆర్ అండ్ బీ ఏఈఈ విశ్వనాథ్, టౌన్ ప్లానింగ్ అధికారులు వసుంధర, వికాస్, సంతోష్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**పనులకు అనుమతులు**

తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(టీయూఎఫ్ఐడీసీ) ద్వారా సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో రూ.26.94 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి లభించిందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం మునిసిపల్ ఇంజనీర్లతో సమీక్షించి మాట్లాడారు. ఈనిధులతో అంబేద్కర్ ఆడిటోరియం, లైబ్రరీ, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, వివేకానంద సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, మోడ్రల్ లాండ్రీ మార్ట్, ధోబీ ఘాట్, ఫుట్ పాత్ తదితర పనులు చేపట్టాలని కలెక్టర సూచించారు. ఈసమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ నవీన్, సత్తుపల్లి మునిసిపల్ ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### పన్ను మినహాయింపులో పారదర్శకత



డీసీ సుధాకర్‌నాయక్

**ఖమ్మం సహకారనగర్:** జిల్లాలోని అన్నిశాఖల డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు తమ పరిధి ఉద్యోగుల వేతనాల నుంచి ఆదాపు పన్ను మినహాయించే సమయాన పారదర్శకత పాటించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌నాయక్(ఐఆర్ఎస్)సూచించారు. ఖమ్మంలో డీడీఓలకు టీడీఎస్, ఆదాయపు పన్ను మదింపుపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈసదస్సులో కలెక్టర్, డీసీ మాట్లాడుతూ వేతనాలకు సంబంధించి ఆదాయపు పన్ను రికవరీలో ఆదాయపు పన్ను శాఖ నిబంధనలను పాటించాలని చెబుతూ, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఖజానా శాఖ జిల్లా డీడీ వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు శ్రీనివాస్, బాలరాజు, జ్యోతి, అనసూయ, ప్రత్యూష, ఎం.వేలాద్రి, విజయ్‌కుమార్, కృష్ణకుమారి, మంజుల, శారద, కృష్ణారావు, ఎల్లయ్య, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీకి రూ.8.05కోట్లు

- వైద్య, ఆరోగ్య శాఖ ఉత్తర్వులు
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పువ్వాడ

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసే నూతన మెడికల్ కళాశాలకు సంబంధించి అదనపు నిర్మాణాల కోసం రాష్ట్రప్రభుత్వం రూ.8.05 కోట్లు నిధులు కేటాయించింది. ఈమేరకు గురువారం పరిపాలనా అనుమతులు ఇస్తూ వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కలెక్టరేట్ నుండి మెడికల్ కాలేజీ కార్యకలాపాలు చేపట్టాలని నిర్ణయించారు. తరగతుల నిర్వహణ, ఇతర అవసరాల కోసం ప్రస్తుత కలెక్టరేట్‌తోపాటు జిల్లా ప్రధాన ఆస్పత్రిలో మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాగా, నిధులు మంజూరు చేయడంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సీఎం కేసీఆర్‌కు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

**ఆస్పత్రి కాదు ఇక వైద్యకళాశాల..**

జిల్లా ప్రధాన ఆస్పత్రి బోర్డు మారింది! ఆస్పత్రి స్థానంలో ప్రభుత్వ వైద్యకళాశాల, జనరల్ ఆస్పత్రిగా గురువారం రాత్రి బోర్డు ఏర్పాటుచేశారు. అదనపు భవనాల నిర్మాణానికి నిధుల మంజూరైన రోజే బోర్డు మార్చేయడం. ఇప్పటికే ఆస్పత్రిని వైద్య విద్య సంచాలకుల పరిధిలోకి తీసుకోగా, రానున్న విద్యాసంవత్సరంలో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానుండడంతో ఏర్పాట్లు ఒక్కటొక్కటిగా చేస్తున్నట్లు తెలుస్తోంది.





ప్రభుత్వ వైద్యకళాశాలగా ఏర్పాటుచేసిన బోర్డు

# వచ్చే ఏడాది నాటికి 'తామర'కు చెక్

- మిర్చిలో తామర పురుగుపై పరిశోధనలు చేస్తున్నాం..
- తోటలను పరిశీలించిన బెంగళూరు శాస్త్రవేత్తలు



నల్లతామర పురుగుతో దెబ్బతిన్న తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**తిరుమలాయపాలెం:** గత ఏడాది నుండి మిర్చి తోటలను తీవ్రంగా నష్టపరుస్తున్న తామర పురుగుల ఉధృతి నివారణకు పరిశోధనలు జరుగుతున్నాయని.. వచ్చే ఏడాది నాటికి సమగ్ర కీటక నివారణ చర్యలు అందుబాటులోకి వస్తాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు. మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటిస్తున్న బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ కె.శ్రీదేవి, డాక్టర్ వి.శ్రీధర్, డాక్టర్ రచన, డాక్టర్ కందన్ గురువారం తిరుమలాయపాలెం మండలంలోని గోల్‌తండా పరిధి గోపాయిగూడెంలో రైతు దేవరం వెంకటరెడ్డి సాగుచేసిన మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్చి నాటిన దశ నుండే రైతులు సామూహికంగా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. దుక్కిలో వేపపిండి వేసుకోవడం, మొక్కలు నాటాక జిగురు అట్టలను పెట్టుకోవడం, కంచెగా జొన్న విత్తనాలను నాటుకుంటే ఫలితముంటుందని చెప్పారు. అలాగే, వేపనూనె, కానుగ నూనెలను క్రిమిసంహారక మందులో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాగా, తామర పురుగుల నివారణకు రైతులు విరివిగా పురుగుమందులు వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలా చేస్తే పురుగు నిరోధక శక్తిని పెంచుకుని ఉధృతి పెరుగుతుందన్నారు. జీవి నియంత్రకాలైన బవేరియా, లెకాని సిల్లియం, బాసిల్లస్, సుడోమోనాస్ పిచికారి చేసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది నాటికి దేశవ్యాప్తంగా అధ్యయనం చేసి తామర పురుగు నివారణకు మందులను అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషి చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. బెంగళూరు శాస్త్రవేత్తలు వి.వెంకటరవణప్ప, ల్యాబ్ అసిస్టెంట్ మిథున్, హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కె.వేణుగోపాల్, ఎం.మహేష్, మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె.భాస్కర్, డాక్టర్ ఎస్.మాలతి, సెంట్రల్ పెస్ట్ మేనేజ్‌మెంట్ అధికారి సునీత, నీలారాణి, రవిశంకర్, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయతో పాటు అధికారులు, రైతులు డాక్టర్ హేమంత్‌కుమార్, నగేష్, సీతారాంరెడ్డి, మంగీలాల్, నంద్యాల శ్యాంసుందర్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

### కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం

**భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి పూజలు, నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

**'రెవెన్యూ' ఆధ్వర్యంలో రాపత్తు సేవ**

శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రాపత్తు సేవ నిర్వహించారు. తొలుత పల్లకీలో స్వామివారిని వేంచేపు చేసి, మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా ఉదయ్‌భాస్కర్ రోడ్డు వద్ద ఉన్న మండపానికి తీసుకొచ్చారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, ఆర్ఐ నర్సింహారావు, సిబ్బందితో పాటు ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న భట్టి, నాయకులు

**ఖమ్మం సహకారనగర్:** స్కూల్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్టీఎఫ్) ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడగా ఎస్టీఎఫ్ రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోచయ్య, దేవరకొండ సైదులు, గుండు యాదగిరి, మన్సూర్‌తో పాటు పోతగాని వెంకన్న, సురేష్, మహబూబ్ అలీ, మూర్తి, కె.పుల్లయ్య, వి.జనార్దనాచారి, గోపాల్, శ్రీనివాస్, ఆంజనేయులు, జి.రాంచందర్ పాల్గొన్నారు.

### మోటమర్రి వాసికి డాక్టరేట్



ఏసుకరుణ

**బోనకల్:** మండలంలోని మోటమర్రికి చెందిన కొండ్రు డేవిడ్ రంగారావు – సువార్త కుమార్తె ఏసుకరుణకు డాక్టరేట్ లభించింది. నానో టెక్నాలజీ రంగంలో డాక్టర్ కె.రామ్మోహన్‌రావు, ప్రొఫెసర్ హరిహరణ్ పర్యవేక్షణలో ఆమె సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను విశాఖలోని గీతం యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కాగా, గ్రామంలో డాక్టరేట్ సాధించిన కరుణను పలువురు అభినందించారు.

### విద్యుత్ బిల్లుల పేరిట మోసానికి యత్నం

**నేలకొండపల్లి:** సోషల్ మీడియా అందరికీ అందుబాటులోకి వస్తుండగా.. అదే స్థాయిలో మోసాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యాన విద్యుత్ బిల్లు బకాయి చెల్లించాలని, లేకపోతే కనెక్షన్ తొలగిస్తామంటూ సెల్‌ఫోన్లకు వస్తున్న మెసేజ్‌లతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. నేలకొండపల్లి మండలంలోని పలువురికి ఇలాంటి మెసేజ్‌లు పంపిస్తూ, వివరాలకు 83918 10596 నంబర్‌లో సంప్రదించాలని సూచిస్తున్నారు. ఈ విషయమై నేలకొండపల్లి ఏఈ కె.రామారావును వివరణ కోరగా తామెవరికీ మెసేజ్‌లు పంపించమని స్పష్టం చేశారు. తప్పుడు మెసేజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న ఆంజనేయస్వామి

**వైరా:** మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పథకాలు చేస్తోందని జిల్లా మత్స్యశాఖాధికారి ఆంజనేయస్వామి తెలిపారు. వైరాలో గురువారం నిర్వహించిన మత్స్య సహకార పారిశ్రామిక సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారులకు బీమా సౌకర్యం, సబ్సిడీపై రుణాలు, వాహన సదుపాయం కల్పించగా, సభ్యత్వం పొందిన మత్స్యకారులే చేపల వేట కొనసాగించాలని సూచించారు. అర్హత కలిగిన ముదిరాజ్ కుటుంబాలను మత్స్య సహకార సంఘం సభ్యత్వాన్ని కల్పిస్తామని తెలిపారు. సంఘం అధ్యక్షుడు షేక్ రహీం, ఉపాధ్యక్షుడు షేక్ సైదులు, కార్యదర్శి షేక్ రహీంతో పాటు చాంద్, నర్సింహారావు, రామారావు, ఉద్దండు, జ్ఞానరత్నం, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల చోరీకి యత్నం

**కూసుమంచి:** మండలంలోని గట్టుసింగారంలోని ప్రైవేట్ నర్సరీలో బుధవారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు చోరీకి యత్నించారు. సదరు వ్యక్తులు మొక్కలను రెండు ట్రాలీ ఆటోల్లో నింపుతుండగా, ఆ దారిలో వెళ్తున్న యువకుడు గుర్తించి నర్సరీ యజమానికి ఫోన్ చేశాడు. దీంతో అక్కడకు వచ్చిన యజమాని, గ్రామస్తులు కలిసి మొక్కల చోరీకి యత్నించిన వారిని బంధించారు. గురువారం ఉదయం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అదుపులోకి తీసుకుని మహబూబాబాద్ జిల్లా మరిపెడ వాసులుగా గుర్తించి విచారణ చేపట్టారు.

### నదిలో పడి ఐటీబీపీ జవాన్ మృతి

**అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రమాదం**



రమేష్ (ఫైల్)

**ఖమ్మంరూరల్:** అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం గువాహటి సమీపాన నదిలో వాహనం పడడంతో ఇండోటిబెటిన్ బార్డర్ పోలీస్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న జవాన్ మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పీక్లీ తండాకు చెందిన భూక్యా రమేష్ కుటుంబం ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీసిటీలో నివాసముంటోంది. రమేష్ గువాహటిలోని ఇండోటిబెటిన్ బార్డర్ పోలీస్(ఐటీబీపీ) విభాగంలో విధులు నిర్వర్తిస్తుండగా, కొద్ది రోజుల క్రితమే స్వగ్రామం నుంచి వెళ్లి విధుల్లో చేరాడు. ఈక్రమంలో గువాహటి సమీపాన గురువారం తెల్లవారుజామున సైనికులకు సంబంధించి సామాగ్రి తీసుకెళ్తున్న ట్రక్కు ప్రమాదవశాత్తు నదిలో పడింది. ఈ ఘటనలో నలుగురు పడిపోయినా ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. అయితే, రమేష్ మాత్రం నీటమునిగి మృతి చెందినట్లు రాత్రి సమాచారం అందింది. ఆయనకు భార్య రేణుక, ముగ్గురు పిల్లలు ఉండగా, కన్నీరుమున్నీరవుతున్నారు.

# బయోమైనింగ్ షురూ

- డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలు ఓ పక్కకు..
- తేమ శాతం తగ్గాక మొదలుకానున్న సేగ్రిగేషన్
- బయోమైనింగ్‌లో పలు దశలు



డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలను పక్కకు వేస్తున్న ప్రొక్లెయినర్

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధి దానవాయిగూడెంలో దశాబ్దాలుగా డంపింగ్ యార్డ్‌లో వేస్తున్న చెత్త గుట్టలుగా పేరుకుపోగా, పలు సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో అధికారులు, పాలకవర్గం, ప్రభుత్వం ఈ సమస్యకు చెక్ పెట్టాలని నిర్ణయం తీసుకుంది. డంపింగ్‌యార్డ్‌లో ఇప్పటి వరకు వేసిన చెత్తను బయో మైనింగ్ చేయాలని నిర్ణయించి, క్యూబ్స్ సంస్థతో బయోమైనింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. వ్యర్థాలను బయోమైనింగ్ చేసే పనిని సంస్థ బాధ్యులు గురువారం ప్రారంభించారు. తొలుత డంపింగ్ యార్డ్‌లో పేరుకపోయిన వ్యర్థాలను ఓ పక్కకు చేరుస్తున్నారు. తద్వారా తేమ తగ్గుతుందని, ఆతర్వాత సేగ్రిగేషన్(వ్యర్థాలను వేరు చేయడం) చేయనున్నట్లు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో ప్రక్రియ మొదలైతే డంపింగ్ యార్డ్ స్థలం శుభ్రం కావడమే కాక 25 ఎకరాల స్థలాన్ని పార్కులు, ఇతర అవసరాలకు వినియోగించుకునే వీలవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన స్థలంలో కంపోస్టింగ్, వ్యర్థాల బయోమైనింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు.

**టన్నుకు రూ.550..**

దశాబ్దాల నుంచి డంపింగ్‌యార్డ్‌లో పోసిన చెత్తను బయో మైనింగ్ చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం యార్డ్‌లో 2.67 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉంటుందని అంచనా. దీనిని బయో మైనింగ్ ద్వారా శుభ్రం చేసేందుకు క్యూబ్స్ సంస్థకు టన్నుకు రూ.550 చొప్పున చెల్లించనున్నారు. సుమారు రూ.16 కోట్లకు అంచనా వ్యయంతో ఈ ప్రక్రియ చేపట్టగా, వ్యర్థాలను పక్కకు చేర్చే ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం పని పూర్తయ్యేందుకు ఏడాది సమయం పడుతుందని చెబుతున్నారు. కాగా, వివిధ దశల్లో వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా వేరు చేస్తూ రీసైక్లింగ్‌కు పంపిస్తారు. ప్లాంట్ పూర్తి స్థాయిలో ప్రారంభమైతే రోజుకు 10 నుండి 20 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ చేయడం సాధ్యమవుతుంది.

**వివిధ దశల్లో బయోమైనింగ్..**

- ఫీడింగ్ హాపర్ అనే యంత్రంలో జేసీబీల ద్వారా చెత్త వేస్తారు. ఇక్కడి నుంచి కన్వేయర్ బెల్ట్ ద్వారా ట్రామెల్ యంత్రంలోకి వెళ్తుంది.
- ట్రామెల్‌లోకి వెళ్లే చెత్తలో 100 ఎం.ఎం. కన్నా ఎక్కువ పరిమాణం కలిగిన వ్యర్థాలు(ప్లాస్టిక్ బాటిళ్లు, దుస్తులు) బయటకు వస్తాయి. అంత కంటే తక్కువ పరిణామంలోని చెత్త రెండో ట్రామెల్‌లోకి వెళ్తుంది.
- ఇక్కడ 35 ఎం.ఎం. కన్నా ఎక్కువ పరిమాణం గల వ్యర్థాలు బయటకు వచ్చేస్తాయి. వీటిలో ఉండే చిన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు, దుస్తుల వంటి వాటిని ఆర్డీఫ్(రెఫ్యూజ్డ్ డిరైవ్ ఫ్యూయెల్)గా పిలుస్తారు.
- మూడో ట్రామెల్ యంత్రంలోకి వచ్చే వ్యర్థాల్లో 16 ఎం.ఎం. కన్నా ఎక్కువ ఉన్నవి బయటకు వస్తాయి. అంతకంటే తక్కువ ఉన్న వ్యర్థాలు నాలుగో ట్రామెల్ యంత్రంలోకి వెళ్తాయి.
- నాలుగో యంత్రం నుంచి 8 ఎం.ఎం. కన్నా ఎక్కువ పరిమాణం కలిగిన వ్యర్థాలు బయటకు వస్తాయి. మిగిలినదంతా బయో ఎర్త్ నాలుగు దశల్లో శుద్ధీకరణ తర్వాత చూర్ణమై జీవ ఎరువులుగా బూడిదరంగులో బయటకు వస్తుంది. దీనిని పంట పొలాల్లో ఎరువుగా వినియోగించవచ్చు.

**మొదటి దశ ప్రారంభమైంది...**

డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ ప్రక్రియ పనులు ప్రారంభమయ్యాయి. ఎప్పటి నుంచో పేరుకుపోయిన వ్యర్థాలను తొలిదశలో భాగంగా ఓ పక్కకు చేరుస్తున్నారు. చెత్తను అంతా పక్కకు నెట్టడం ద్వారా యార్డ్ స్థలం శుభ్రమవుతుంది. అనంతరం బయో మైనింగ్ పనులు మొదలుపెడతారు.

– మల్లీశ్వరి, అసిస్టెంట్ కమిషనర్, కేఎంసీ

## బిల్ కలెక్టర్లను ఆర్టిజన్లుగా గుర్తించండి



ధర్నాలో పాల్గొన్న బిల్ కలెక్టర్లు

**ఖమ్మంవ్యవసాయం:** ఆర్టిజన్లుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో విద్యుత్ బిల్ కలెక్టర్లు గురువారం కలెక్టరేట్ ఎదుట ఉన్న ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ, సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ అనుబంధ టీఎస్‌యూఈఈఏ కార్యదర్శి ఎం.ప్రసాద్ మాట్లాడగా.. జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావుతో పాటు ఎన్.సీతయ్య, వై.విక్రమ్, రమ్య, వెంకన్న తదితరులు మద్దతు తెలిపారు. ధర్నాలో బిల్ కలెక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.ప్రభాకర్, జి.గురునాథం, సీహెచ్.శ్రీనివాస్‌రావు, పాశం నాగేశ్వరరావు, హరి, కోటేశ్వరరావు, పి.సత్యనారాయణ, దినేష్, భరత్, నరేష్, ఎస్.కే.రహీం, వినోద్‌కుమార్, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందారుల సంఘాలకు ఎన్నికలు జరపాలి



పశుసంవర్ధక, పశు వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**ఖమ్మంవ్యవసాయం:** జిల్లాలో ఉన్న 332 గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించడమే కాక గొర్రెల పథకంలో లబ్ధిదారులకు నగదును బదిలీ చేయాలని, మున్సిపాలిటీల్లో గొర్రెలకు బదులుగా పాడి గేదెలు అందించాలని వివిధ సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య యాదవ్, యువజన యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు చిత్తూరి సింహాద్రి యాదవ్ ఆధ్వర్యాన గురువారం జిల్లా పశుసంవర్ధక, పశువైద్యాధికారి వేణుమనోహర్‌రావుకువినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొదిలి సతీష్, గూడె భద్రయ్య, మల్లెబోయిన శ్రీనివాస్, బట్ట కోటేశ్వరరావు, జోనబోయిన పాపయ్య, సత్తి వెంకన్న, గుండెబోయిన ముత్తయ్య, వీరబోయిన సంగయ్య పాల్గొన్నారు.

## భూములు తీసుకుంటే ఆత్మహత్యే శరణ్యం



దోజర్‌ను అడ్డుకుంటున్న రైతులు

**రఘునాథపాలెం:** నలభై ఏళ్లుగా తాతలు, తండ్రుల కాలం నుంచి సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను బలవంతంగా తీసుకుంటే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని పలువురు రైతులు వెల్లడించారు. ఈమేరకు మండలంలోని మంచుకొండలో అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు గురువారం చదును చేయిస్తుండగా అడ్డుకున్నారు. మంచుకొండ రెవెన్యూలో సుమారు 16 ఎకరాలకు పైగా అసైన్డ్ భూములను పట్టాదారులు రియల్ వ్యాపారులకు అమ్మినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో పంట ఉన్నందున మూడెకరాలను పక్కన పెట్టగా ఆ భూమిని చదును చేసేందుకు గురువారం డోజర్‌తో రావడంతో రైతులు అడ్డుకున్నారు. వాహనాలను అడ్డుకుని పురుగు మందు డబ్బాలతో నిరసన తెలపడంతో రెవెన్యూ సిబ్బంది వెనక్కి వచ్చారు.

### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**ఖమ్మంక్రైం:** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన షేక్ యాకుబ్ పెయింటింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, కొంతకాలంగా భార్యభర్తల మధ్య తరచూ గొడవలు అవుతుండటంతో గత పది రోజులుగా ఆయన భార్య వేరే దగ్గర ఉంటుంది. ఈక్రమంలో ఆమె వద్దకు వచ్చిన యాకుబ్ మళ్లీ గొడవపడి తన వద్ద ఉన్న బ్లేడ్‌తో గొంతు, చేయి కోసుకున్నాడు. స్థానికులు ఫోన్ చేయటంతో బ్లూకోర్ట్ కానిస్టేబుల్ మనోహర్ అక్కడకు చేరుకొని 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**రఘునాథపాలెం:** చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటకు చెందిన ఎం.డీ.యాకూబ్ (48) రఘునాథపాలెం మండలంలోని కోటపాడు చెరువులో చేపలు పట్టేందుకు గురువారం మరికొందరికి కలిసి వెళ్లాడు. చేపలు పడుతుండగా యాకూబ్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గమనించిన సహచరులు ఆయనను ఒడ్డుకు తీసుకొచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, యాకూబ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న యాకూబ్ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు.

### అందరి కృషితోనే పీపీఎల్ విజయవంతం



సమావేశంలో పాల్గొన్న టోర్నీ నిర్వాహకులు

**ఖమ్మం స్పోర్ట్స్:** అందరి కృషితోనే పువ్వాడ ప్రీమియర్ లీగ్(పీపీఎల్) క్రికెట్ టోర్నీ విజయవంతమైందని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు నెల పాటు శ్రమించి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచనలకు తోడు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.డీ.మసూద్ పాషా సహకారంతో టోర్నీ సాఫీగా సాగిందని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, రాపర్తి శరత్, కన్నం ప్రసన్న, సిటీ లైబ్రరీ చైర్మన్ ఆష్రఫ్‌తో పాటు బత్తుల మురళి, కాకి భాస్కర్, బాలబోయిన సందీప్, ప్రకాష్ రాకేష్, ఫారుక్, బోయినపల్లి లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### వేధింపులపై కేసు నమోదు

**పెనుబల్లి:** మండలంలోని తుమ్మలపల్లికి చెందిన వివాహితకు సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపించి వేధిస్తున్న వారిపై గురువారం కేసు నమోదైంది.తుమ్మలపల్లికి చెందిన వివాహితకు ఏపీలోని తిరువూరు మండలం వావిలాలకు చెందిన దంపతులు మరబతుల గోపాల్ – జమలమ్మ కొంతకాలంగా అసభ్యకర మెసేజ్‌లు పంపిస్తున్నారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు వీఎం బంజర ఎస్సై జి.సూరజ్ కేసు నమోదు చేశారు.

### మెస్ యజమానిపై..

**సత్తుపల్లి:** మైనర్ బాలుడిని పనిలో పెట్టుకున్న మెస్ యజమానిపై కేసు నమోదైంది. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా గురువారం ఎస్సై నరేష్, లేబర్ ఆఫీసర్ ఎస్.పాదం చేపట్టిన తనిఖీల్లో స్థానిక శ్రీవిఘ్నేశ్వర మెస్‌లో బాలుడిని పని పెట్టుకున్నట్లుగా గుర్తించారు. ఈమేరకు యజమాని నాగభూషణంపై కేసు నమోదు చేశారు.

### మంగాపురం టు నేపాల్!

**అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక**



నేపాల్ వెళ్తున్న మంగాపురం విద్యార్థులు

**నేలకొండపల్లి:** మండలంలోని మంగాపురంతండాకు చెందిన గిరిజన విద్యార్థులు కబడ్డీలో సత్తా చాటుతున్నారు. గత నెల గోవాలో జరిగిన అండర్–19 కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన ఇంటర్ విద్యార్థులు భూక్యా నవీన్, గణేష్, సాకేత్, భార్గవ్, ఉదయ్, నవనీత్ కుమార్, గోపి, జానకీరాం నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అక్కడ యూత్ గేమ్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన ఇండో – నేపాల్ ఇంటర్నేషనల్ సిరీస్ శుక్రవారం మొదలుకానుంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు నేపాల్ బయలుదేరగా, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ భూక్యా సుధాకర్ తదితరులు అభినందించారు.

### ● కమ్మేసిన మంచుదుప్పటి!

కొన్నాళ్ల పాటు చలి తీవ్రత తగ్గినట్లుగా కనిపించినా మళ్లీ ఒకటి, రెండు రోజులుగా ఉధృతి పెరుగుతోంది. డిసెంబర్ నెలాఖరులో చలి తగ్గి, ఉష్ణోగ్రతలు పెరగగా విద్యుత్ వినియోగం అదే స్థాయిలో పెరిగింది. కానీ మళ్లీ జనవరి మొదలైనప్పటి నుంచి చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. సత్తుపల్లిలో గురువారం ఉదయం మంచు విపరీతంగా కురవడంతో బయటకు వెళ్లాల్సిన వారు ఇబ్బంది పడగా... వాహనదారులు ఉదయం ఏడు గంటల వరకు కూడా లైట్లు వేసుకుని పయనించారు.

– సత్తుపల్లి టౌన్



సత్తుపల్లిని కమ్ముకున్న మంచు



లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

## చకచకా మన ఊరు – మన బడి పనులు

**పాఠశాలల్లో తనిఖీ చేసిన విద్యాశాఖ ఏడీ**



కల్లూరు : విద్యార్థులతో మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసాచారి



విద్యార్థులు సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ

**కల్లూరు/కల్లూరురూరల్/తల్లాడ:** జిల్లాలోని పలు పాఠశాలలను పాఠశాలల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి గురువారం తనిఖీ చేశారు. కల్లూరు మండలం నారాయణపురం ఎంపీపీఎస్, కల్లూరు ఎంపీపీఎస్ పాఠశాలలతో పాటు తల్లాడ మండలం రెడ్డిగూడెం పాఠశాలను సందర్శించిన ఆయన మన ఊరు – మన బడి పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా కల్లూరులో పనుల పురోగతిని పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధనపై సూచనలు చేశారు. అలాగే, పనులపై ప్రధానోపాధ్యాయులు వంగా రామారావు, నున్నా కృష్ణయ్యతో చర్చించారు. ఇక తల్లాడ మండలం రెడ్డిగూడెం పాఠశాలలో పనులను కూడా ఏడీ శ్రీనివాసాచారి పరిశీలించారు. తొలిమెట్టులో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు, మన ఊరు – మన బడి పనులను పరిశీలించి మరింత వేగం పెంచాలని తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఎంఈఓలు దామోదరప్రసాద్‌తో పాటు అధికారులు, ఉపాధ్యాయులు పొంగా శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, జి.మాధవరావు, మామిడాల వెంకటేశ్వరరావు, రవీంద్ర, శివ, ఇ.స్పందన, వరప్రసాద్, శివకృష్ణ పాల్గొన్నారు.

**పాఠశాలలో డీఈఓ తనిఖీ..**

**తల్లాడ:** మండలంలోని అన్నారుగూడెం జెడ్పీహెచ్ఎస్‌ను డీఈఓ సోమశేఖరశర్మ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించడమే కాక విద్యార్థులను సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు రమేష్, సరోజిని, ఉపాధ్యాయులు మాదినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నెస్పీ అండర్ టన్నెల్‌కు బుంగ



వృథాగా పోతున్న నీరు

**కొణిజర్ల:** నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ అండర్ టన్నుల్‌కు బుంగ పడింది. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి సమీపాన 27వ కిలోమీటర్ వద్ద బుంగ పడగా నాలుగు రోజుల నుంచి నీరు వృథాగా పోతోంది. ఈ విషయమై రైతులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా పాలేరు డివిజన్ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ గోపాలరావు, ఏఈ సతీష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..ఇప్పుడు తాత్కాలిక మరమ్మతు చేయడంతో పాటు వేసవిలో నీటి సరఫరా నిలిపేశాక పూర్తి స్థాయి మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఇప్పటికే నాలుగు రోజుల నుంచి నీటి సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు చెప్పగా, ఒకటి, రెండు రోజుల్లో యూటీ పనులు పూర్తి చేసి నీటి సరఫరా పునురుద్ధరిస్తామని చెప్పారు.

## ప్రమాదాల నివారణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

**ఖమ్మంరూరల్:** గ్రానైట్ రాళ్ల తరలించే సమయంలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించినట్లు గ్రానైట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ తెలిపారు. మండలంలోని ఆటోనగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్వారీల నుంచి ఫ్యాక్టరీలకు లారీల్లో గ్రానైట్ తరలించే సమయాన డ్రైవర్లు అప్రమత్తంగా ఉండేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ఘటన దరదృష్టకరమని చెప్పారు. అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరెడ్డి, దొడ్డ అశోక్, ఖాసిం, వాసు, ఏ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యనగర్‌లో చోరీ

**ఖమ్మంరూరల్:** మండలంలోని ఆదిత్యనగర్‌లో ఉంటున్న గోకినపల్లి వెంకటేశ్వర్లు ఇంట్లో గుర్తుతెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లు ఈ నెల 3న హైదరాబాద్ వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు గమనించి లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని బంగారు, వెండి నగలు కనిపించలేదు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

**వన్‌టౌన్ పరిధిలో..**

**ఖమ్మంక్రైం:** నగరంలోని వనటౌన్ పరిధిలో గురువారం ఓ వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. అద్దంకివారి వీధికి చెందిన పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగి చిట్యాల విజయభాస్కర్ దంపతులు గత నెల 31వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా, వారి ఇంటి వెనుక ఓ కుటుంబం అద్దెకు ఉంటుంది. అద్దెకు ఉంటే వారు కూడా ఊరికి వెళ్లగా.. విజయభాస్కర్ దంపతులు తిరిగి 3వ తేదీ రాత్రి వచ్చారు. ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి వెనుక భాగంలో అద్దెకు ఉండే వారి తలుపులు తెరిచి ఉండడంతో అద్దెకు ఉంటున్న వారికి ఫోన్ చేసి తెలిపింది. ఆ తర్వాత వారు ఉండే గదికి వెళ్లి చూడగా.. తలుపులు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని 8తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు గమనించి వనటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

**కొణిజర్ల:** విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని లాలాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. లాలాపురం 19వ వార్డుకు చెందిన ఇమ్మడి బాబు ఇంటిలో గురువారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని సామగ్రితో పాటు రెండు బైక్‌లు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే వస్తువులన్నీ కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు చెప్పాడు. కాగా, వైరా నుంచి ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది.